సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 5 । డిసెంబర్ । 2024



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,620
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,122
3 శాతం జీఎస్టీతో	రూ.7,336
నవర (8 గ్రా)	రూ.58,688



హాయ్.. సింహపురి

సినీ నటి ప్రియాంక మోహన్ సింహపురిలో బుధవారం సందడి చేశారు. వీఆర్సీ సమీపంలో ఏర్పాటు చేసిన జేసీ మాల్‌ను ప్రారంభించేందుకు వచ్చిన ఆమె అభిమానులను పలకరించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. 4లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.2 /26.8

జిల్లాలో ఒకట్రెండు చోట్ల మోస్తరు జల్లులు గురువారం పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గాలిలో తేమ 92 శాతంగా బుధవారం నమోదైంది.

న్యూస్‌రీల్

మద్యం షాపు విషయంలో టీడీపీ డ్రామాలు

- పెట్టాలని ఓ వర్గం డిమాండ్
- వద్దంటున్న మరో వర్గం
- తాజాగా షాపు ఏర్పాటు చేయాలంటూ మహిళల నినాదాలు



మద్యం దుకాణం ఏర్పాటు కోసం నినాదాలు

ఉదయగిరి: మద్యం షాపు ఏర్పాటులో ఉదయగిరి మండలం గండిపాళెంలో టీడీపీ నేతల మధ్య విభేదాలు తలెత్తాయి. ఇక్కడ షాపు ఏర్పాటును ఆ పార్టీలోని ఓ వర్గం వ్యతిరేకిస్తూ గత నెల 27న మహిళలతో నిరసన తెలిపింది. అయితే మరో వర్గం ఇక్కడే పెట్టాలంటూ గ్రామ కూడలిలో బుధవారం సాయంత్రం నినాదాలు చేశారు. ఇందులోనూ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. సాధారణంగా మద్యం విక్రయాలను మహిళలు వ్యతిరేకించడాన్ని చూస్తాం.. అయితే కావాలంటూ నినాదాలు చేయడంపై గ్రామస్తులు నోరెళ్లబెట్టారు. మద్యం ఆదాయంలో రుచి మరిగిన తమ్ముళ్లు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలను ముందు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. గండిపాళెంలో 2013కు ముందు మద్యం షాపు ఉండేది. దీంతో కుటుంబాల్లో నిత్యం గొడవలు జరిగేవి. 2014లో అప్పటి సర్పంచ్ గుంటుపల్లి నాగేశ్వరి ఆధ్వర్యంలో మద్యం షాపును మూసేయాలంటూ ఉద్యమం చేసి తీయించారు. అప్పటి నుంచి నేటి వరకూ దుకాణాన్ని ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో టీడీపీలోని ఓ వర్గం ఉదయగిరిలో ఉన్న ఓ దుకాణాన్ని గండిపాళెంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. దీన్ని మరో వర్గం వ్యతిరేకిస్తూ షాపు కావాలంటూ మహిళలతో కార్యక్రమాన్ని చేయించింది.

11న వర్క్‌షాపు

నెల్లూరు (టౌన్) : నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో నాన్ వెర్బల్ క్యూస్‌పై ఒక రోజు వర్క్‌షాపును ఇంగ్లిష్ విభాగ ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ వెర్బల్ కమ్యూనికేషన్ ప్రాధాన్యం, వ్యక్తిగత, ప్రొఫెషనల్ వ్యవహార శైలిపై ప్రభావం, ద్వితీయ భాషా సంకేతాలు తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నామని వెల్లడించారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు.

రేషన్‌ను బొక్కేస్తూ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ మాఫియా బరితెగిస్తోంది. దీనికి అధికార పార్టీ పచ్చ జెండా ఊపడంతో వీరి ఆగడాలకు అంతేలేకుండాపోతోంది. మంత్రి నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని ఎన్టీఆర్‌నగర్ నుంచి ఈ మాఫియా శాసిస్తోంది. డీలర్లు.. ఎండీయూ వాహనాలు.. సమీప జిల్లాల నుంచి బియ్యాన్ని సేకరించి చెన్నై, కృష్ణపట్నం పోర్టులకు తరలిస్తూ.. అక్కడి నుంచి దేశాన్ని దాటించేస్తున్నారు. షాడో ఎమ్మెల్యేలకు ప్రతి నెలా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు.. అధికారులకు మామూళ్లను ముట్టజెప్పుండటంతో ఈ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలు చందంగా సాగుతోంది.

- ఎన్టీఆర్‌నగర్ నుంచే శాసిస్తున్న మాఫియా
- ఆరు జిల్లాల నుంచి బియ్యం సేకరణ
- రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారుల నుంచి కొనుగోలు
- షాడోలకు భారీగా ముట్టజెప్తూ..
- ప్రతి నెలా తరలిపోతున్న 13 వేల మెట్రిక్ టన్నులు
- చెన్నై, కృష్ణపట్నం పోర్టుకు చేరుతున్న వైనం



'..అవునండీ రేషన్ బియ్యాన్ని నేనే సేకరిస్తున్నా.. ప్రతి నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేలకు ప్రతి నెలా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ముట్టజెప్తున్నాం.. మీరు వ్యాపారం చేసుకుంటే ఎలా.. ఇకపై సేకరిస్తే విజిలెన్స్ అధికారులకు చెప్పి కేసులు నమోదు చేయిస్తా.. జిల్లాలో మేము చెప్పిన వారికే విక్రయించాలి..' ఇలా ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ రేషన్ బియ్యం వ్యాపారి చిరు వ్యాపారులను బెదిరించారు. దందా ఏ రకంగా సాగుతోందనే అంశానికి ఇది ఓ ఉదాహరణ మాత్రమే.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అక్రమార్కులకు ఇది వరంలా మారడంతో యథేచ్ఛగా కొల్లగొడుతూ ఇతర ప్రాంతాలకు తరలించి భారీగా వెనుకేసుకుంటున్నారు. ఈ అక్రమ దందాకు అధికారులు పరోక్ష సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ తంతు..

నగరంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ రేషన్ బియ్యం వ్యాపారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన స్నేహితుడితో కలిసి మాఫియాను హస్తగతం చేసుకున్నారు. గతంలో రేషన్ డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్ల నుంచి పేదలకందాల్సిన బియ్యాన్ని నెల్లూరులోని దాదాపు వెయ్యి మంది చిరువ్యాపారులు కొనుగోలు చేసి సదరు వ్యాపారికి విక్రయించేవారు. కిలోకు రూ.16 చొప్పున డీలర్లకు అప్పగించి.. ఆ ప్రాంతానికి చెందిన వ్యాపారికి కిలోను రూ.23కు విక్రయించేవారు. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో చిరు వ్యాపారులను పక్కన పెట్టేశారు. కార్పొరేషన్ పరిధిలో షాడో మంత్రి.. షాడో ఎమ్మెల్యేలకు నెలకు రూ.లక్షల్లో ముట్టజెప్పేలా ఒప్పందం కుదుర్చుకున్నారనే ఆరోపణలున్నాయి. చిరు వ్యాపారులను ఇప్పటికే పిలిపించి ఇకపై ఎవరూ రేషన్ బియ్యాన్ని సేకరించొద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు.

సేకరణ ఇలా..

ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు రేషన్ బియ్యాన్ని సేకరిస్తారు. ఇలా వచ్చిన బియ్యాన్ని గుడిపల్లిపాడు వద్ద సదరు వ్యాపారికి చెందిన రైస్ మిల్లుకు తరలిస్తారు. అక్కడ రీపాలిష్ చేసి బ్రాండెడ్ బ్యాగుల్లో నింపి చెన్నై తరలిస్తారు. అనంతరం అక్కడ పాలిష్ చేసిన బియ్యాన్ని కిలోను రూ.50కు అక్కడి వ్యాపారులకు విక్రయిస్తారు. పాలిష్ చేయని బియ్యాన్ని కృష్ణపట్నం పోర్టు ద్వారా ఎగుమతి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా ఎగుమతి చేసేందుకు బియ్యాన్ని మరో మాఫియా సేకరిస్తోంది.

బాధ్యతల విభజన..!

జిల్లాలోని ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు, కోవూరు, కావలి, సర్వేపల్లి నియోజకవర్గాల్లో రేషన్ బియ్యం సేకరణ బాధ్యతను ఒక్కొక్కరికి అప్పగించారు. ప్రస్తుతం నెల్లూరుకు చెందిన ఓ వ్యాపారి తన అనుచరులను రంగంలోకి దింపి వారి ద్వారానే బియ్యాన్ని సేకరిస్తున్నారు. షాడో ఎమ్మెల్యేలకు ప్రతి నెలా నగదును ముట్టజెప్పేలా ఒప్పందం కుదుర్చుకోవడంతో అడ్డుకునేందుకు ఎవరూ సాహసించడంలేదు.

దారిమళ్లుతున్న సగభాగం

జిల్లాలో 1860 చౌక దుకాణాలున్నాయి. నెల్లూరు నగర, రూరల్‌కు సంబంధించి 170కుపైగా ఉన్నాయి. ప్రతి నెలా 26 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. 11 ఎమ్మెల్‌ఎస్ పాయింట్ల నుంచి చౌక దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఇందులో దాదాపు 50 శాతం అంటే 13 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పేదల నుంచి సేకరించి రీసైక్లింగ్ చేసి ఇతర దేశాలు, రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

కఠిన చర్యలు చేపడతాం: వెంకటరమణ, డీఎస్‌ఓ

బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవు. చౌక దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు చేపడతాం. అక్రమ రవాణాపై ఫిర్యాదులొస్తే దాడులు చేసి అడ్డుకుంటాం. రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేసేలా మండల స్థాయి అధికారులకు ఆదేశాలిస్తాం.

కొల్లగొట్టి.. విలాసవంతంగా



మంత్రి నారాయణ ఇలాఖాకు చెందిన బియ్యం మాఫియా ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు ఉమ్మడి ప్రకాశం, కడప తదితర జిల్లాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తోంది. ప్రకాశం జిల్లా నుంచి కందుకూరు, కావలి మీదుగా నెల్లూరుకు తరలించి, ఎన్టీఆర్‌నగర్‌లోని గోదాముల్లో నిల్వ ఉంచుతారు. అక్కడి నుంచి రైస్‌మిల్లుకు రాత్రి వేళ తరలించి రీసైక్లింగ్ చేస్తారు. గోదాముల నుంచి నేరుగా చెన్నై పోర్టుకు చేరుతాయి. సదరు వ్యాపారి రేషన్ దందాను 20 ఏళ్లుగా సాగిస్తున్నారు. ఇలా ఇప్పటికే రూ.వందల కోట్లు వెనుకేసుకున్న సదరు మాఫియా నేత రైస్‌మిల్లుల కొనుగోలు, భవంతులు, నిర్మాణాలతో విలాసవంతమైన జీవనాన్ని గడుపుతున్నారు.

ముడుపులతో మభ్యపెడుతూ..

సదరు రేషన్ బియ్యం వ్యాపారి తన దందా సజావుగా సాగేందుకు వీలుగా రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్, పౌరసరఫరాల శాఖలను మేనేజ్ చేయడంలో ఆరితేరారు. వాహనాల్లో రేషన్ బియ్యం రాత్రివేళ లోడ్ అవుతోందనే విషయం అందరికీ తెలిసినా ఆ వైపు కన్నెత్తి చూడటంలేదు. ఒకవేళ ఎవరైనా విజిలెన్స్, పోలీస్ శాఖలకు ఫోన్ చేస్తే.. సదరు వ్యాపారికి ఇట్టే తెలిసిపోతుంది. ఫోన్ చేసిన వారికి బెదిరింపు కాల్స్ వస్తాయి. పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫోన్ చేస్తే.. పోలీసులకు చేయండి అంటూ కాల్‌ను కట్ చేస్తున్నారు.

ముగ్గురు ఎంపీడీఓలపై చర్యలకు సిఫార్సు

- ముగ్గురు ఉపాధి సిబ్బందిపై వేటు

నెల్లూరు(పొగతోట): కొడవలూరు మండలం తలమంచిలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడ్డారనే అంశం రుజువు కావడంతో ముగ్గురు ఎంపీడీఓలపై చర్యలకు సిఫార్సు చేయగా, ముగ్గురు ఉపాధి సిబ్బందిని సస్పెండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. గతేడాదిలో నిర్వహించిన ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారనే అంశాన్ని సోషల్ ఆడిట్‌లో నిర్ధారించారు. దీనికి సంబంధించి విచారణలో వాస్తవాలు వెలుగుచూడటంతో కొడవలూరు మండలంలో పనిచేసిన ఎంపీడీఓలు సుబ్రహ్మణ్యం, నరసింహారావు, జ్యోతిపై చర్యలకు సిఫార్సు చేశారు. ఏపీఓ, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్‌ను సస్పెండ్ చేశారు.

మోపాడు చెరువుకు జలకళ

- పది అలుగు గేట్లెత్తిన అధికారులు

కందుకూరు రూరల్: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మోపాడు చెరువు నిండింది. చెరువులోకి నీరు చేరుతుండటంతో పది గేట్లను బుధవారం ఎత్తి ఒక్కో గేటు నుంచి 200 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ ఏఈ త్రివిక్రమ్ తెలిపారు. నీటి ప్రవాహం సాయంత్రానికి తగ్గుతుందని, ఆ తర్వాత గేట్లను అరడుగు తగిస్తామని చెప్పారు.

నిలిచిన రాకపోకలు

మోపాడు చెరువు అలుగు గేట్లు ఎత్తడంతో కొండముడుసుపాళెం సమీపంలో చప్టాపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కందుకూరు, గుడ్లూరు, కావలి మధ్య ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్ల రాకపోకలు నిలిచిపోయాయి. పక్కనే ఉన్న ఎర్రవాగుకు నీరు చేరింది.

తప్పిన ప్రమాదం

కావలి నుంచి కందుకూరు వస్తున్న ఆర్టీసీ బస్సుకు ప్రమాదం త్రుటిలో తప్పింది. ఎదురుగా ఉన్న ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో డ్రైవర్ కొంచెం పక్కకు వెళ్లడంతో ఓ పక్క టైర్లు చప్టా దిగాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నిలిపేశారు. జేసీబీ సాయంతో ఎమర్జెన్సీ ద్వారం నుంచి ప్రయాణికులను బయటకు తరలించారు. అనంతరం జేసీబీతో ఆర్టీసీ బస్సును బయటకు తీశారు.

గ్రామస్తుల పూజలు

కొన్నేళ్ల తర్వాత చెరువు పూర్తి స్థాయిలో నిండటంతో అలుగు గేట్లెత్తారు. దీంతో చెరువుకు కొండముడుసుపాళెం గ్రామస్తులు పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమలిచ్చి హారతులు పట్టారు.



కొండముడుసుపాళెం సమీపంలో చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



నిండుకుండలా మోపాడు చెరువు

సాగు.. భళా

కూనారం వరిపై రైతుల ఆసక్తి



ఆరుగాలం కష్టించే రైతులు ఈ రబీ సీజన్లో కూనారం వరి రకం సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణలోని కూనారం వ్యవసాయ పరిశోధన స్థానం కనుగొన్న కేఎన్‌ఎం – 1630 వరి వంగడం జిల్లాకు రెండేళ్ల క్రితం పరిచయమైంది. ప్రస్తుతం దీనిపై క్రేజ్ పెరుగుతోంది. ఫలితంగా ఎప్పటి నుంచో సాగులో ఉన్న బీపీటీ – 5204, ఎన్‌ఎల్‌ఆర్ – 34449 సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది.



పొదలకూరులో సాగులో ఉన్న కూనారం వరి

- కేఎన్‌ఎం – 1638 పేరుతో వంగడం
- రబీలో 60 శాతానికి అవకాశం
- దిగుబడితో పాటు తెగుళ్లనూ తట్టుకునే రకం
- బీపీటీ, ఎన్ఎల్‌ఆర్‌పై తగ్గుతున్న మోజు

పొదలకూరు: కూనారం వరి సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం సాగయ్యే విస్తీర్ణంలో కేఎన్‌ఎం – 1638 రకం నాట్లు 60 శాతం మేర పడే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఫలితంగా కూనారం నుంచే వచ్చిన ఆరెన్నార్ – 15048 (షుగర్ లెస్) సాగు విస్తీర్ణం ప్రస్తుత రబీలో తగ్గే అవకాశం ఉంది. గతేడాది ఇదే సీజన్లో ఈ రకాన్ని గణనీయంగా సాగు చేశారు.

సింహభాగం ఇదే..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రబీలో సుమారు ఏడు లక్షల ఎకరాల్లో వరిని సాగు చేయనున్నారని ఐఏబీ సమావేశంలో అధికారులు వెల్లడించారు. ఇందులో నాలుగు లక్షలకుపైగా ఎకరాల్లో సింహభాగం కూనారం వరి రకమే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వేస్తున్న నాట్లలోనూ కేఎన్‌ఎం రకమే అధికంగా ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు.

ఆసక్తి ఎందుకంటే..


ఆరెన్నార్ – 15048 (తెలంగాణ మసూర)పై నాలుగేళ్లుగా మొగ్గుచూపిన రైతులు తాజాగా కేఎన్‌ఎం – 1638 రకంపై ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం శివార్లలో గల ఆచార్య జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ వంగడాన్ని మూడేళ్ల క్రితం రూపొందించారు. దిగుబడి బాగా ఉండటమే కాక చీడపీడల ఖర్చు తక్కువగా ఉండటంతో దీనిపై అన్నదాతలు ఆసక్తి కనబరుస్తున్నారు. సన్న రకం కావడమే కాకుండా బీపీటీ కంటే నెల ముందే కోతకొస్తోంది. 120 రోజులకు దిగుబడినివ్వడంతో పాటు వర్షాకాలంలో అంటే నవంబర్ 15 నుంచి డిసెంబర్ 20 వరకు నార్లు పోసుకునేందుకు అవకాశం ఉంటుంది. సంక్రాంతి సమయంలో రైతులు నాట్లు వేస్తే మంచి దిగుబడిని సాధించేందుకు ఆస్కారం కలుగుతుంది.

వెనుకబడుతున్న ఎన్ఎల్‌ఆర్ రకం

ఐదేళ్ల క్రితం వరకు ఎన్ఎల్‌ఆర్ – 34449 (నెల్లూరు మసూరా) జిల్లాలో తిరుగులేని వరి వంగడంగా వెలుగొందింది. అయితే కోతల విషయంలో ఇబ్బందులు.. తెగుళ్లు.. దిగుబడి తదితర కారణాలతో ఈ రకాన్ని రైతులు క్రమంగా తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 20 శాతం సాగుకు సైతం ఇది నోచుకోవడంలేదు. బీపీటీ – 5204 రకానికి గిట్టుబాటు ధరలు లభిస్తున్నా, ఈ రకం వరి నాట్లూ తగ్గిపోతున్నాయి. ఎంటీయూ – 1010 రకాన్ని సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు.


దిగుబడీ భారీగానే..

రబీలో ఎకరానికి నాలుగు.. ఎగడారులో మూడు పుట్ల దిగుబడినిస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు. అగ్గి తెగులును సమర్థంగా తట్టుకునే శక్తి కేఎన్‌ఎం – 1638కు ఉండటంతో రైతులు నార్లు పోసుకుంటున్నారు. ప్రభుత్వం సైతం కూనారం రకం విత్తనాలపై కిలోకు రూ.ఐదు చొప్పున రాయితీని ఇచ్చి రైతులకు అందజేస్తోంది.



ఆసక్తి పెరిగింది

కేఎన్‌ఎం – 1638 రకం వరిసాగుపై ఆసక్తి పెరిగింది. సాగుకు ఏది అనుకూలమైతే ఆ రకం వంగడాన్ని రైతులు ఇష్టపడతారు. కేఎన్‌ఎం దిగుబడి బాగుండటంతో రబీలో చాలా మంది దీన్నే సాగు చేస్తున్నారు. రైతులంతా దాదాపు కూనారం రకాన్నే వేశారు.
– రమణారెడ్డి, రైతు, మహ్మదాపురం



దిగుబడి బాగుంది

కేఎన్‌ఎం – 1638 వరి రకం దిగుబడి బాగుంది. ప్రస్తుతం ఈ రకం ధాన్యం పుట్టి రూ.27 వేల వరకు మార్కెట్లో విక్రయమవుతోంది. దిగుబడి, ధరలను దృష్టిలో ఉంచుకొని కేఎన్‌ఎం వెరైటీని సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. విత్తనాలను రాయితీపై వ్యవసాయ శాఖ ద్వారా అందజేశాం.
– శివనాయక్, ఏడీఏ, పొదలకూరు

జిల్లాను వీడని వర్షాలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు బుధవారం కురిశాయి. నగరంలో తేలికపాటి జల్లులు కురవగా, పొదలకూరులో భారీ వర్షం నమోదైంది. బోగోలు, ఆత్మకూరు, జలదంకి, ఏఎస్‌పేట తదితర మండలాల్లో జల్లులు కురిశాయి. జిల్లాలో సరాసరి 12.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

గోదాముల్లో విజి'లెన్స్'

- రూ.కోటి సరుకు సీజ్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని పలు గోదాముల్లో తనిఖీలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక అధికారుల బృందం బుధవారం చేపట్టారు. ఎన్టీఆర్‌నగర్, నవాబుపేట తదితర ప్రాంతాల్లోని తినుబండారాల గోదాము.. నగరానికి చెందిన మహేంద్రకు సంబంధించిన పాన్‌మసాలా, గుట్కా గోదాము.. బీరు తయారీలో ఉపయోగించే బియ్యం గోదాముల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. జీఎస్టీని చెల్లించడంలేదనే అంశాన్ని అధికారులు గుర్తించారు. దీంతో గోదాముల్లోని రూ.కోటికిపైగా ఉన్న సరుకును సీజ్ చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడారు. జీఎస్టీ చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు గండికొట్టే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు

జలదంకి: కావలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టిప్పర్‌ను క్రాస్ చేస్తుండగా ముందు ఉన్న టైరు కాలువలో దిగబడిన ఘటన మండలంలోని బీకే అగ్రహారం గిరిజన కాలనీ సమీపంలో బుధవారం జరిగింది. బస్సు కావలి నుంచి వేములపాడుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రోడ్డు చిన్నది కావడంతో టిప్పర్‌ను క్రాస్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ముందు టైరు కాలువలో దిగబడి బస్సు ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం జేసీబీ సాయంతో బస్సును బయటకు లాగారు.

నిందితుడి కోసం ముమ్మర గాలింపు

ఉదయగిరి: ఉదయగిరి ఎస్టీ కాలనీలో వివాహితను హత్య చేసి పరారైన భర్త కోసం పోలీసులు గాలిస్తున్నారు. మస్తాన్ మంగళవారం తన భార్య ఇందిరను కత్తితో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. బుధవారం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడి గురించి పోలీసుల వద్ద ఇప్పటికే కొంత సమాచారం ఉన్నట్లుగా తెలిసింది. మస్తాన్‌ను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

అంతా 'గ్యాస్' మాటలే..

అధికారంలోకి వచ్చేందుకు కూటమి పెద్దలు సూపర్ సిక్స్ అంటూ హామీలు గుప్పించారు. తీరా గద్దెనెక్కాక ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రతి ఇంటికీ ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. తీరా చూస్తే ఈ సంవత్సరానికి ఒక్క సిలిండర్‌కే పరిమితం చేశారు. సాకులు చెప్పి లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించారు. మహిళల ఆశలపై నీళ్లు చల్లారు.

– నెల్లూరు(పొగతోట)

- కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు తూట్లు
- దీపం-2లో ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్క సిలిండరే
- లబ్ధిదారుల ఎంపిక విషయంలోనూ నిర్లక్ష్యం
- 18 వేల మందికి ఇంకా పడని సబ్సిడీ నగదు



➡ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు ఎన్నికల ప్రచారంలో మహిళలకు ఎన్నో హామీలిచ్చారు. వాటిలో ఒకటి ప్రతి ఏడాది ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు. అధికారంలోకి వచ్చాక దీపం – 2 పథకం పేరుతో దీనిని ప్రారంభించారు.

➡ మొత్తం వినియోగదారులు 8 లక్షలకు పైగా ఉన్నారు. ఇందులో దీపం – 2 కింద లబ్ధిదారులు సుమారు 4 లక్షల పైనే ఉంటారని అధికారులు తొలుత లెక్కకట్టారు. తీరా చూస్తే కేవైసీ, ఆధార్, బ్యాంక్, ఫోన్ నంబర్లు లింక్ కాలేదంటూ చాలా మందిని అనర్హులుగా ప్రకటించారు.

➡ వినియోగదారులు బ్యాంక్ అకౌంట్‌కు ఫోన్ నంబర్, ఆధార్ కార్డు లింక్ చేయాలంటూ అధికారులు గతంలో ఉత్తర్వులు జారీ చేశారు. గ్యాస్ ఏజెన్సీలు, సచివాలయాల పరిధిలో చేసుకోవాలంటూ ప్రచారం చేశారు.

➡ నెల్లూరు నవాబుపేట రైతు బజార్‌లో నాలుగైదు నెలల నుంచి ఆన్‌లైన్ పని చేయడం లేదని, కేవైసీ చేయలేమని సమాధానం చెబుతున్నారు. ఈ విధంగా అన్ని ఏజెన్సీల్లో పరిస్థితి ఉంది. చాలామంది మహిళలు ఏజెన్సీలు, బ్యాంక్‌ల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

➡ పథకం ప్రారంభించాక జిల్లాలో 2,50,000 పైగా వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేశారు. వారి బ్యాంక్ అకౌంట్లలో సుమారు రూ.19 కోట్ల నగదు జమ చేయాల్సి ఉంది.

➡ ఇప్పటివరకు సుమారు రూ.17.70 కోట్లు జమైంది. వాస్తవానికి సిలిండర్ డెలివరీ చేసిన 48 గంటల్లోనే బ్యాంక్ అకౌంట్‌లో డబ్బు పడాలి. అయితే రోజులు గడుస్తున్నా 18 వేలమందికి నగదు అందలేదు.

➡ ఈ విషయమై లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, బ్యాంక్‌ల చుట్టూ తిరుగుతున్నారు. అకౌంట్‌కు ఆధార్, ఫోన్ నంబర్ లింక్ కాలేదని సాకులు చెబుతున్నారు.

➡ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి ఒక్క సిలిండర్ మాత్రమే లబ్ధిదారులకు అందనుంది. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా ఏడాదికి మూడు సిలిండర్లు అందే సూచనలు కనిపించడం లేదు. ఉచిత సిలిండర్ కావాలంటే ఈ ఆర్థిక సంవత్సరం తర్వాతేనని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో..

వినియోగదారులు :	ఉచిత సిలిండర్లకు గుర్తించిన అర్హులు :
సుమారు **8** లక్షలకు పైగా..	**2.50** లక్షలు

అర్హులందరికీ సబ్సిడీ పడుతుంది

గ్యాస్ సబ్సిడీ నగదు అర్హులందరికీ వారి బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. నగదు జమ కానీ బ్యాంక్ ఖాతాలకు ఫోన్ నంబర్, ఆధార్ లింకై ఉండవు. ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటరమణ, డీఎస్‌ఓ

నేరాల కట్టడికి ప్రత్యేక ప్రణాళిక



డీఎస్పీ శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

- నేరాలకు పాల్పడే వారిపై షీట్లు తెరవండి
- ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'నేరాల కట్టడికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. గ్రామ సందర్శన, పల్లె నిద్ర కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో బుధవారం ఆయన పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, ఆస్తి సంబంధిత నేరాలు, పోక్సో, డెకాయిటీ, రాబరీ, రోడ్డు ప్రమాదాలు, కేసుల పెండెన్సీ తదితరాలపై సర్కిల్స్ వారీగా సమీక్షించారు. నేర నియంత్రణ, కేసుల ఛేదన, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, తీరు మారని వారి జాబితాను పంపితే పీడీ యాక్టులు నమోదు చేస్తామన్నారు. పదేపదే నేరాలకు పాల్పడుతోన్న వారిపై రౌడీషీట్లు తెరవాలన్నారు. నేరస్తులను కట్టడి చేసే బాధ్యత డీఎస్పీలదేనని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి బ్లాక్‌స్పాట్ల వద్ద అవసరమైన సిగ్నల్ లైట్లు, సూచికబోర్డులు, స్టాపర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలను విధిగా పెట్టాలన్నారు. మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై దాడులు ముమ్మరం చేసి నిందితులపై కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వారితోపాటు సరఫరా చేస్తున్న వారిపై సైతం కేసులు నమోదు చేయాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా అదృశ్యమైన వారిని గుర్తించి కుటుంబాల చెంతకు చేర్చాలని చెప్పారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగతనం కేసుల్లో నిందితులను అరెస్ట్ చేయడంతో పాటుగా చోరీ సొత్తును రికవరీ చేయాలన్నారు. ఈనెల 14వ తేదీన జరిగే మెగా లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. ఇటీవల హిజ్రా హత్య కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, కొడవలూరు సీఐ ఎ.సురేంద్రబాబు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, జి.మునిరాజా, ఎస్బీ, నెల్లూరు నగర, రూరల్, కావలి, ఆత్మకూరు, కందుకూరు, డీటీసీ, ఏఆర్ డీఎస్పీలు, లీగల్ అడ్వైజర్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం కోసం తమ్ముళ్ల కుట్రలు



షాపును పరిశీలిస్తున్న పోలీసులు

- రాత్రి బియ్యం దొంగతనం
- ఉదయాన్నే దుకాణం తనిఖీకి వచ్చిన డీటీ

కందుకూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో రేషన్ దుకాణాలను దక్కించుకునేందుకు టీడీపీ నేతలు చేస్తున్న కుట్రలు అన్నీ ఇన్నీ కావు. ఓగూరు ఎస్సీ కాలనీలో దగ్గుమాటి కోటయ్య రేషన్ డీలర్. టీడీపీ నేతలు ఆ షాపును దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చెంచురామయ్య అసిస్టెంట్ కోటయ్యకు ఫోన్ చేసి దుకాణం తనిఖీకి వస్తున్నామని చెప్పాడు. కోటయ్య బయట ఉండటంతో కుమారుడు కళ్యాణ్ కుమార్‌ను షాపు వద్దకు పంపగా అప్పటికే తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న కోటయ్య వచ్చి పరిశీలించి మంగళవారం రాత్రి బియ్యం దొంగతనం జరిగినట్లు వాపోయాడు. అయితే డీటీ మాత్రం దొంగతనంతో తనకు సంబంధం లేదని, బియ్యం తక్కువగా ఉన్నట్లు కేసు రాస్తానని చెప్పాడు. దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీలర్ తెలిపాడు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల ప్రోత్సాహంతోనే కొందరు షాపు తాళం పగులగొట్టి బియ్యాన్ని దొంగతనం చేసి ఉంటారని కోటయ్య అనుమానం వ్యక్తం చేస్తున్నాడు.

అట్టహాసంగా జేసీ మాల్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న నటి ప్రియాంక మోహన్

- విచ్చేసిన సినీ నటి ప్రియాంక మోహన్

నెల్లూరు(బృందావనం): నెల్లూరులోని ట్రంకురోడ్డు వీఆర్సీ సెంటర్ దగ్గర 'జేసీ మాల్ ఫ్యాషన్ ఫర్ సేల్' నూతన శాఖను బుధవారం ప్రముఖ సినీ నటి ప్రియాంక మోహన్ ప్రారంభించారు. జేసీ షాపింగ్ మాల్ అధినేతలు జనార్దనరెడ్డి, జమునా రెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం మాల్‌ను ప్రియాంక మోహన్ నిర్వాహకులతో కలిసి సందర్శించారు. సినీ నటి వస్తున్నారన్న సమాచారంతో యువతీయువకులు భారీగా మాల్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రియాంక మోహన్ మాట్లాడుతూ వస్త్ర రంగంలో జేసీ మాల్ గ్రూప్ సంస్థ రాణిస్తూ సుదీర్ఘ అనుభవంతో తెలుగు రాష్ట్రాల్లో పలు బ్రాంచ్‌లను నెలకొల్పిందన్నారు. సింహపురి వాసులకు సరికొత్త కలెక్షన్లను పరిచయం చేసేందుకు నెల్లూరులో జేసీ మాల్‌ను అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమన్నారు. అనంతరం ఆమె అభిమానులతో ముచ్చటించారు. జనార్దనరెడ్డి, జమునారెడ్డిలు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో కేవలం రూ.99 నుంచి అన్ని రకాల డిజైన్లు దొరికే జేసీ మాల్‌ను నెల్లూరీయులు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాల్ డైరెక్టర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. కొండచిలువ

ఆత్మకూరు రూరల్: మండలంలోని గండ్లవీడులో కొండచిలువ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. వివరాలు.. గ్రామంలోని సాయిబాబా మందిరం సమీపంలో నాగూరమ్మకు చెందిన కోళ్లఫారంలో మంగళవారం రాత్రి కోళ్లు అరుస్తుండడాన్ని గుర్తించిన స్థానికులు వెతికారు. భారీ కొండచిలువ కనిపించడంతో భయపడి చంపారు. ఇంతలో వర్షం రావడంతో దానిని అక్కడ వదిలి వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున చనిపోయిన కొండచిలువ కనిపించకపోవడంతో కుక్కలు తీసుకెళ్లి ఉంటాయని భావిస్తున్నారు.



కొండ చిలువను చూపుతున్న గ్రామస్తులు

దెయ్యం ఉంది.. పూజలు చేయాలంటూ..

- బురిడీ కొట్టించి బంగారు ఉంగరాల అపహరణ
- అల్లూరులో ఘటన

అల్లూరు: 'మీ ఇంట్లో దెయ్యం ఉంది. పూజ చేయకపోతే రెండు నెలల్లో అశుభం జరుగుతుంది' అని భయభ్రాంతులకు గురిచేసి బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన అల్లూరులో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. అల్లూరు దళితవాడకు చెందిన శ్రీనివాసులు ఇంటికి అయ్యప్ప మాల ధరించిన ముగ్గురు వ్యక్తులు వెళ్లారు. వారు అడిగిన మేరకు శ్రీనివాసులు భిక్షం వేసే సమయంలో మీ ఇంట్లో దెయ్యం ఉందని, పూజ చేసి దానిని పంపించకపోతే రెండు నెలల్లో కుటుంబంలోని వ్యక్తి చనిపోతారని భయపెట్టారు. పూజ చేయాలంటే రూ.21,000లు ఖర్చవుతుందని చెప్పగా తన వద్ద అంత మొత్తం లేదని శ్రీనివాసులు చెప్పాడు. వారు కొంచెంసేపు పూజ చేస్తున్నట్లు నటించి అతని చేతికి ఉన్న రెండు సవర్ల బంగారు ఉంగరాలకు పూజ చేసిస్తామని నమ్మబలికారు. ఉంగరాలను తీసుకుని పొట్లం కట్టి పసుపు కలిపిన బియ్యంలో వేశారు. దేవుడు పటాల వద్ద పెట్టి పూజ చేయాలని చెప్పగా శ్రీనివాసులు అలాగే చేశాడు. కాసేపటి తర్వాత బయటికొచ్చి చూస్తే ఆ ముగ్గురూ కనిపించలేదు. ఇంట్లోకి వెళ్లి శ్రీనివాసులు పొట్లం విప్పి చూడగా ఉంగరాలు కనిపించలేదు. మోసపోయానని గుర్తించి అల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆస్పత్రికి రూ.61.62 లక్షల జరిమానా

- నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు తీర్పు

నెల్లూరు(అర్బన్): శస్త్రచికిత్సను నిర్లక్ష్యంగా చేసి బాధితుడు కంటి చూపు కోల్పోవడానికి కారణమయ్యారంటూ నెల్లూరులోని ఓ ప్రముఖ ఆస్పత్రి యాజమాన్యానికి రూ.61.62 లక్షల జరిమానా విధిస్తూ ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జింకారెడ్డి శేఖర్ బుధవారం తీర్పు చెప్పారు. వివరాలు.. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన పంచాయతీ కార్యదర్శి చేవూరు సురేష్‌బాబు వైద్యం నిమిత్తం 2017లో ఆస్పత్రికి వచ్చాడు. సైనసైటిస్ శస్త్రచికిత్స చేసుకోవాలని వైద్యులు సూచించగా, అదే ఏడాది మే 11న సెప్టోప్లాస్టీ, మినీ ఈఎఫ్ఈఎస్సెస్ చికిత్స చేయించుకున్నాడు. ఆపరేషన్ చేయించుకున్న రెండో రోజు ఎడమకంటి చూపు కోల్పోయాడు. తలకు సంబంధించిన సమస్యలూ వచ్చాయి. దీంతో ఆయన చెన్నై అపోలో, బ్రెయిన్ అండ్ స్పైన్ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్నాడు. అనంతరం వినియోగదారుల కోర్టును బాధితుడు ఆశ్రయించాడు. ఆధారాలను పరిశీలించి, సైనసైటిస్ ఆపరేషన్ జరిగిన సమయంలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బాధితుడు కంటి చూపు కోల్పోయాడని, పలు సమస్యలొచ్చాయని న్యాయమూర్తి నిర్ధారించారు. ఆపరేషన్‌తో పాటు చెన్నై అపోలో, బ్రెయిన్ అండ్ స్పైన్ ఆస్పత్రుల్లో చేయించుకున్న శస్త్రచికిత్సలు, మందులు, ఇతరాలకు రూ.21,62,752 ఖర్చయింది. ఈ మొత్తంతో పాటు బాధితుడి శారీరక, మానసిక వేదన, ఇతర నష్టాలకు రూ.40 లక్షలు.. మొత్తంగా రూ.61,62,752 చెల్లించాలని తీర్పు చెప్పారు. 45 రోజుల్లో పరిహారం చెల్లించకపోతే తీర్పు వెలువడిన నాటి నుంచి తొమ్మిది శాతం వడ్డీతో మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించారు.

మాకు సంబంధం లేదు

వినియోగదారుల కోర్టు ఇచ్చిన తీర్పుతో తమ ఆస్పత్రికి సంబంధం లేదని మెడికవర్ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. బాధితుడికి ఆపరేషన్ జరిగిన నాటికి దేశంలో తమ ఆస్పత్రులను సంస్థాగతంగా స్థాపించలేదని తెలియజేశారు. నెల్లూరులో 2017 నాటికి మెడికవర్ లేదని తెలిపారు. సింహపురి ఆస్పత్రి మాత్రమే ఉండేదని, ఈ కేసు పూర్తిగా వారికి సంబంధించిందేనన్నారు. తమపై నిరాధార ఆరోపణలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

కండలేరులో 54.500 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 54.500 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి 1,500, సోమశిల జలాశయం నుంచి 2,150 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 800, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 45 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

కావలి: పట్టణంలోని సంకులవారితోటకు చెందిన రెహమాన్ (47) రైలు కింద పడి మృతిచెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. రెహమాన్ స్థానికంగా ప్రైవేట్‌గా ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటికొచ్చాడు. రాత్రి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది స్థానికంగా వెతికారు. బుధవారం ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం అందడంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడిని రెహమాన్‌గా గుర్తించి కుటుంబానికి సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు.


జైలు అధికారుల సస్పెన్షన్

ఆరిలోవ(విశాఖ): విశాఖ కేంద్ర కారాగారంలో పనిచేసి నాలుగు రోజుల క్రితం బదిలీపై వెళ్లిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. కారాగారంలో ఇటీవల అవాంఛనీయ ఘటనలు జరిగాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అప్పుడు సూపరింటెండెంట్‌గా ఎస్.కిశోర్‌కుమార్, అదనపు సూపరింటెండెంట్‌గా ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు. నాలుగు రోజుల క్రితం బదిలీల్లో కిశోర్‌కుమార్ అనంతపురం ఓపెన్ ఎయిర్ జైల్‌కు, వెంకటేశ్వరరావు నెల్లూరు కారాగారానికి వెళ్లారు. విశాఖ జైల్లో జరిగిన ఘటనకు వీరి నిర్లక్ష్యం కారణమని నిర్ధారణైంది. దీంతో సస్పెండ్ చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కావలి: పట్టణంలోని వెంగయగారిపాళెంలో అక్రమంగా లారీలో తరలిస్తున్న 120 బస్తాల రేషన్ బియ్యంను బుధవారం కావలి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పట్టుకున్నారు. లారీని ఒకటో పట్టణ పోలీసులకు, బియ్యంను పౌరసరఫరాల శాఖకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 107
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 224
లేయర్ చికెన్	: 187